అనునిత్యం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి 1
ఆదివారం 28 మే 2023

మంత్రి వస్తేనే రోడ్లు శుభ్రం చేస్తారా..? : బీఎస్పీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు పర్యటన సందర్భంగా ఎల్లారెడ్డిలో నీ ప్రధాన రోడ్లను వీధులను శుభ్రం చేస్తున్నారే తప్ప ఎల్లారెడ్డిని అభివృద్ధి చేయడం లేదని బీఎస్పీ పట్టణ అధ్యక్షులు మరులు సాయిబాబా శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో మురికి కాలువలు సక్రమంగా లేక వీధులన్నీ చిన్ని పార్టీ వర్షాలకే జలమయం అవుతున్నాయని, ఇళ్లలోకి మురికి నీరు వస్తున్నాయని ప్రతి వర్షాకాలం ప్రజలు మొర పెట్టుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. పలు వీధుల్లో సిసి రోడ్లు లేక రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయని, పట్టణ కేంద్రంలోని పలు పాఠశాలలో పురాతన భవనాలు శిథిలావస్థలో ఉండి విద్యార్థులకు ప్రమాదకరంగా మారాయని తెలిపారు. అలాంటి వాటిని గుర్తించి నూతన భవనాలు కట్టించి విద్యార్థులకు సౌకర్యం కల్పించాలని, ఇప్పటికైనా స్థానిక నాయకులు స్థానిక సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఎల్లారెడ్డిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

బస్సులో సీటు గొడవ..

పోలీస్‌స్టేషన్‌లో ఇరువురి ఫిర్యాదు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బస్సులో సీటు కోసం గొడవ జరగడంతో ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్న ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన ఆలూరు భోజమ్మ ఆమె మనుమడు హైదరాబాద్ నుంచి అర్గుల్ గ్రామానికి వచ్చేందుకు నిర్మల్ డిపో బస్సు ఎక్కారు. అయితే కామారెడ్డిలో ఆర్మూర్ ప్రాంతానికి చెందిన వినూష ఆమె భర్త అదే బస్సు ఎక్కి ప్రయాణిస్తున్న తరుణంలో అనూషకు, భోజమ్మకు సీటు గురించి గొడవ జరిగింది. అయితే అర్గుల్ గ్రామం వద్ద ఆలూరు భోజమ్మ కుటుంబ సభ్యులు అనూష భర్తను కొట్టడంతో గాయాలయ్యాయి. అనూష జక్రాన్ పల్లి పోలీస్ స్టేషన్ లో తన భర్తను కొట్టారని ఫిర్యాదు చేయగా ఆలూరు భోజమ్మ కుటుంబ సభ్యులు కూడా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఇరువురి ఫిర్యాదులను స్వీకరించి విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

గెలుపు గుర్రాల కోసం వేట

- బీజేపీలోకి ఆర్మూర్ వ్యాపారవేత్త రాకేష్‌రెడ్డి
- తర్జనభర్జనలో ముత్యాల సునీల్‌కుమార్
- అసెంబ్లీ వైపు అరవింద్ చూపు
- మళ్లీ పోటీకి సై అంటున్న సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



వీక్లి రౌండప్

నిజామాబాద్ అడ్డాపై తమ జెండా ఎగరేసేందుకు పార్టీలు పావులు కదుపుతున్నాయి. మరో ఆరు నెలల్లో ఎన్నికలు జరుగుతాయనే ఊహాగానాల నేపథ్యంలో పార్టీలు స్పీడ్ పెంచాయి. అందులో భాగంగా అసెంబ్లీ ఎన్నికలకు గెలుపు గుర్రాల కోసం వేట కొనసాగిస్తు న్నాయి. తాజాగా బీజేపీలోకి ప్రముఖ వ్యాపారవేత్త రాకేష్‌రెడ్డి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. జూన్ 1వ తేదీన ఆ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారని సమాచారం. బాల్కొండ నియోజక వర్గంలో ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌కుమార్ తర్జనభర్జనలో ఉన్నారు. ఏ పార్టీలో చేరే అంశంపై నిర్ణయం తీసుకోవడం లేదు. ఇక బోధన్ నుంచి మరోసారి పోటీకి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. అర్బన్‌లో కాంగ్రెస్ నుంచి మాజీ మేయర్ సంజయ్ పోటీకి సై అంటున్నారు.

ఎన్నికల యేడాది కావడంతో రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఆత్మీయ సమ్మేళనాలతో అధికార బీఆర్‌ఎస్ పార్టీ ముందుకు వెళ్తుంటే.. గెలుపు గుర్రాల కోసం బీజేపీ, కాంగ్రెస్‌లు వేట ప్రారంభించాయి. తాజాగా బీజేపీ లోకి ఆర్మూర్‌కు చెందిన వ్యాపారవేత్త రాకేష్‌రెడ్డి చేరేందుకు సిద్ధమ య్యారు. జూన్ 1వ తేదీన చేరుతారని వార్తలు వినిపిస్తు న్నాయి. ఎంపీ అరవింద్ నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి రాకేష్‌రెడ్డిని బరిలోకి దించాలని ప్రణాళిక వేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆర్మూర్ అసెంబ్లీ నుంచి ఎంపీ అరవింద్ పోటీకి సిద్ధమవుతున్నారు. ఒకవేళ అదే జరిగితే వినయ్‌రెడ్డి పార్టీ వీడే అవకాశమున్నట్టు ప్రచారం జరగుతోంది. గత రెండు పర్యాయాలుగా ఆర్మూర్ నుంచి పోటీ చేసి వినయ్‌రెడ్డి ఓడిపోయిన విషయం తెలిసిందే. కానీ నాటి నుంచి ప్రజల్లోనే ఉంటూ కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం అదే తనకు కలిసి వస్తుందని ఆశిస్తున్నారు. ఎంపీ అరవింద్ ఆర్మూర్ నుంచి పోటీకి దిగితే.. వినయ్‌రెడ్డి హస్తంలో చేరే అవకాశమూ లేకపోలేదని టాక్. ప్రస్తుతం ఆర్మూర్‌లో కాంగ్రెస్‌కు కేడర్ ఉన్నప్పటికీ.. ఛరిష్మా ఉన్న నాయకుడు లేదు. ఒకవేళ వినయ్‌రెడ్డి హస్తంలో చేరితే కాంగ్రెస్ ఓటు బ్యాంకు కలిసి వచ్చే అవకాశముంది. ఇక బాల్కొండ నుంచి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పోటీకి సిద్ధంగా ఉన్నారు. అయితే ఆయనపై బరిలో నిలిచేందుకు సిద్ధంగా ఉన్న ముత్యాల సునీల్‌కుమార్.. ఏ పార్టీలో చేరే అంశంపై ఓ నిర్ణయం తీసుకోవడం లేదు. బీఎస్పీకి రాజీనామా చేసిన తరువాత ఆయన ఏపార్టీలోనూ చేరలేదు. అయితే ఆయనతో కాంగ్రెస్ పార్టీలో టచ్‌లో ఉన్నట్టు సమాచారం. గతంలో ఈ స్థానం నుంచి పోటీ చేసిన ఈరవత్రి అనిల్.. ఈసారి దూరంగా ఉంటారనే ప్రచారం జరుగుతోంది. ఆయన పోటీకి స్వంత పార్టీ కార్యకర్తల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశముందని ఆ నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. ఒకవేళ ముత్యాల సునీల్‌కుమార్ హస్తంలో చేరితే.. మంత్రికి గట్టి పోటీ ఉంటుందని విశ్లేషకుల మాట. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ముత్యాల సునీల్‌కుమార్.. హస్తం పార్టీ నుంచి పోటీకి ప్రయత్నించిన విషయం తెలిసిందే.

బరిలోకి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి..

బోధన్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పోటీకి సిద్ధపడుతున్నారు. ఇక ఈ స్థానంలో బీజేపీ నుంచి మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డిలు బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే అధిష్టానం ఒకరికి టిక్కెట్టు ఇస్తే మరొకరు స్వంత కుంపటి పెట్టే అవకాశం లేకపోలేదు. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే షకీల్ అమేర్.. ఈసారి మహారాష్ట్ర నుంచి పోటీ చేస్తారని టాక్. బోధన్‌లో ఆయన సతీమణి అయేషా ఫాతిమాను బరిలోకి దించుతారని ప్రచారం జరుగుతోంది. ఇక నిజామాబాద్ అర్బన్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ మేయర్ సంజయ్ బరిలోకి దిగే అవకాశముంది. బీజేపీ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ, యెండల లక్ష్మీనారాయణ ఇద్దరు పేర్లు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నుంచి మరోసారి బిగాల గణేష్‌గుప్తా బరిలోకి దిగే అవకాశముంది. రూరల్ నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఈసారి తన తనయుడు బాజిరెడ్డి జగన్‌కు అవకాశం కల్పిస్తారని ప్రచారం జరుగుతోంది. గతంలో జెడ్పీ ఛైర్మన్‌గా జగన్‌ను నియమించాలని ప్రయత్నించినా బీఆర్‌ఎస్ హైకమాండ్ అంగీకరించలేదు. ఆ సమయంలోనే రూరల్ స్థానంలో వచ్చే ఎన్నికల్లో జగన్‌కు అవకాశం కల్పిస్తామని హామీనిచ్చారు. ఈ వాగ్దానం వచ్చిన తరువాతే జెడ్పీ ఛైర్మన్ స్థానం విరమించుకున్నట్టు సమాచారం. కాంగ్రెస్ నుంచి భూపతిరెడ్డి, బీజేపీ నుంచి దినేష్‌రెడ్డిలో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

అప్పు తీర్చకుంటే.. కోరిక తీర్చు

- డాక్టర్ వేధింపులతో నర్సు ఆత్మహత్య : తల్లి ఆరోపణ
- మనోరమ ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- న్యాయం చేయాలంటూ డిమాండ్

నవతెలంగాణ-మోపాల్/కంఠేశ్వర్



మనోరమ ఆస్పత్రి ఎదుట బైటాయించిన బంధువులు, కుటుంబీకులు



ప్రాణాలు కాపాడాల్సిన వైద్యుడే.. ఒకరి ఆత్మహత్యకు కారణమయ్యాడు. ఆర్థిక ఇబ్బందులతో డాక్టర్ వద్ద అప్పు తీసుకున్న పాపానికి అప్పు తిరిగిస్తావా..? లేకుంటే కోరిక తీరుస్తావా అంటూ వేధింపులకు పాల్పడటంతో ఓ నర్సు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం ముదక్‌పల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసు కుంది. నర్సు ఆత్మహత్యకు కారణమైన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కుటుంబీకులు, బంధువులు నగరంలోని మనోరమ ఆస్పత్రి ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. పోలీసులు, కుటుంబీకుల వివరాల ప్రకారం.. ముదక్‌పల్లి గ్రామానికి చెందిన గౌతమి (21) నిజామాబాద్ జిల్లాలోని మనోరమ హాస్పిటల్లో గత కొద్ది సంవత్సరాల నుండి నర్సుగా పని చేస్తుంది. ఇంటి ఆర్థిక అవసరాల నిమిత్తం ఆస్పత్రిలోని ఓ వైద్యుడి నుంచి రూ.80 వేలు అప్పుగా తీసుకుంది. అయితే కొన్ని రోజులుగా ఆస్పత్రి డాక్టర్ అప్పు తీర్చాలంటూ తరచూ వేధించేవాడని గౌతమి తల్లి లక్ష్మీ ఆరోపించింది. తన కూతుర్ని మానసికంగా, శారీరకంగా, లైంగికంగా వేధించేవాడని, డాక్టర్ వేధింపులు భరించలేకనే తన కూతురు శుక్రవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేసింది. తన కూతురు మృతికి ఆస్పత్రిలో విధులు నిర్వహించే డాక్టరే కారణమని ఆరోపించింది. న్యాయం జరిగేంతవరకు తాము ఇక్కడే నిరసన చేపడతామని భీష్మించు కూర్చున్నారు. సంబంధిత డాక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని కుటుంబీకులను సముదాయించారు.

నిజనిర్ధారణ చేపట్టాలి

మా హాస్పిటల్‌లో పనిచేసే నర్సు గౌతమి అందరితో మంచిగా ఉండేదని తన అవసరాల నిమిత్తం డబ్బులు తీసుకుందని హాస్పిటల్ వైద్యుడు కట్ట నరసింహ తెలిపారు. నెల చొప్పున డబ్బులను కడుతుందని, కానీ తన కుటుంబ సభ్యులలో తన తల్లి మాత్రం డాక్టర్‌పై నింద వేయడం సమంజసం కాదని భావిస్తున్నామని అన్నారు. ఒకవేళ డాక్టర్ తప్పు చేసి ఉంటే ఈ విషయం ఎప్పుడో బయటపడేది. ఏదేమైనా పోలీసులు నిజనిర్ధారణ చేయాలని తమ హాస్పిటల్ ద్వారా కోరుతున్నామన్నారు.

ఎలుగుబంటి దాడి

- ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-తాడ్వాయి



గాయపడ్డ సాయిలు

తాడ్వాయి మండలం సంగోజివాడి గ్రామంలో ఎలుగుబంటి సంచారంతో గ్రామ ప్రజలు ఉలిక్కి పడుతున్నారు. గ్రామానికి చెందిన జీపీ వర్కర్ గైని బాల సాయిలు(40)పై ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చెత్త వేయడానికి వెళ్లిన బాల సాయిలుపై ఎలుగు బంటి దాడి తీవ్రంగా దాడి చేయడంతో వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు గ్రామంలో పర్యటించారు. ఎలుగుబంటిని బంధించి తీసుకెళ్తామని గ్రామస్తులకు సూచించారు. ఎవరు బయటకు రాకూడదని సూచించారు. ఎలుగుబంటిని బందించటం కోసం ఫారెస్ట్ అధికారులు మరియు తాడ్వాయి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. దాడిచేసిన అనంతరం ఎలుగుబంటి కనిపించడం లేదు. పొదల చాటున ఎక్కడుందో తెలియక గ్రామ ప్రజలు, భయాందోళనకు గురవుతున్నారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తాడ్వాయి



మృతిచెందిన ప్రసాద్

జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి గైని భాను ప్రసాద్ (25) చిన్నప్పటి నుండి మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం ఎన్నో ఆస్పత్రులు తిరిగినా తగ్గలేదు. దీంతో తీవ్రంగా మానసిక వేదనకు గురైయ్యేవాడు. ఆమె భార్య వారం క్రితం తన తల్లిగారిల్లు అయిన కోర్పోల్ గ్రామానికి వెళ్లింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి శనివారం ఉదయం 5 గంటలకు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య గైని గీతాంజలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

నగరంలో యువతి కిడ్నాప్ కలకలం

- ఆలస్యంగా వెలుగులోకి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఓ యువతిని కొందరు యువకులు కిడ్నాప్ చేసి, ఆపై వేధింపులకు పాల్పడ్డ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఆరవ టౌన్ పరిధికి చెందిన ఓ యువతీ ఈనెల 24వ తేదీన తెలిసిన యువకుడితో కలిసి బైక్ పై ఖిల్లా రోడ్డు గుండా వెళ్తోంది. అయితే ఖిల్లా రోడ్డు ప్రాంతంలో కొందరు యువకులు బుధవారం సాయంత్రం బైకును అడ్డుకున్నారు. ఆపై బైక్పై ఉన్న యువకుడిని బెదిరించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం సదరు యువతిని ఇద్దరు యువకులు బైక్ లపై బలవంతంగా ఎక్కించుకొని కిడ్నాప్ చేసి, ఆపై వేధింపులకు పాల్పడ్డారు. నగరంలోని పలు ప్రాంతాలకు తీసుకువెళ్లి సదరు యువతీ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. అనంతరం బోధన్ రోడ్డులో యువతీని వదిలేశారు. దీంతో సదరు యువతి గురువారం ఉదయం వన్ టౌన్ లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ విజయ్ బాబు ఖిల్లా రోడ్డు ప్రాంతంలో గల సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా హైమద్ పుర కాలనీకి చెందిన ఇంతియాజ్, కంటేశ్వర్ కు చెందిన మతిన్ లుగా గుర్తించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్కు తరలించారు. వారి నుంచి రెండు బైక్ లను స్వాధీనపరచుకున్నట్లు ఎస్ హెచ్ ఓ విజయ బాబు తెలిపారు. పోలీసులు కూడా ఏ రోజు ఏ క్రైమ్ జరిగిందో అనే కొన్ని విషయాలను దాస్తున్నట్లు తెలుస్తుంది. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు ఇచ్చిన సమాచారం మేరకు సంబంధిత పోలీసులు కూడా పత్రిక విలేకరులకు సమాచారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది దీంట్లో దాపరికం చేయడం వల్ల కేసు తప్పు దోవ పట్టే అవకాశం ఉంది.

దశాబ్ధం.. సంక్షేమం, అభివృద్ధి

- రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలి
- అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు దిశానిర్దేశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. జూన్ 2 నుండి 22 వ తేదీ వరకు ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్‌లతో కలిసి కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలు, చేపట్టాల్సిన చర్యల గురించి జిల్లా పాలనాధికారి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ప్రధానంగా తెలంగాణ ఏర్పడిన మీదట గడిచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో ఆయా శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, వివిధ వర్గాల ప్రజలకు చేకూర్చిన లబ్ధి, సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా చూడాలని సూచించారు. ముఖ్య కూడళ్లను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు, అపశ్రుతులు తావులేకుండా అట్టహాసపు ఏర్పాట్ల నడుమ జిల్లా వ్యాప్తంగా దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తూ, అన్ని వర్గాల ప్రజలు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సరైన ప్రణాళికతో కార్యక్రమాలను చేపట్టాలని హితవు పలికారు. ఉత్సవాల్లో భాగంగా జూన్ 2 వ తేదీన పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఉంటాయన్నారు. ప్రభుత్వ కార్యాల యాలు, 3 న అన్ని రైతు వేదికల్లో రైతు దినోత్సవం జరుపాలని, ప్రతి చోట కనీసం వేయి మంది రైతులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందస్తు పంట వేయాల్సిన ఆవశ్యకత, ఆయిల్ పామ్ సాగుతో సమకూరే లాభాల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులు పాల్గొని రైతు దినోత్సవం విజయవంతానికి కృషి చేయాలన్నారు. 4 న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సురక్షా దివస్, 5 న విద్యుత్ విజయోత్సవం, 6 న తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7 న సాగునీటి దినోత్సవం, 8 న ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాలను నిర్వహించాలని వివరించారు. చెరువుల వద్ద ఉత్సవాలు జరిగే సమయంలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. 9న తెలంగాణ సంక్షేమ సంబరాలను, 10 న తెలంగాణ సుపరిపాలన దినోత్సవాన్ని, 11 న సాహిత్య దినోత్సవం, 12 న తెలంగాణ రన్, 13 న మహిళా సంక్షేమ దినోత్సవం, 14 న తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం, 15 న పల్లె ప్రగతి దినోత్సవం, 16 న పట్టణ ప్రగతి దినోత్సవం, 17 న తెలంగాణ గిరిజనోత్సవం, 18 న తెలంగాణ మంచినీళ్ల పండుగ, 19న తెలంగాణ హరితోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి గ్రామ పంచాయతీ, ప్రతి మున్సిపల్ వార్డులో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, పోలీస్ సహా అన్ని శాఖలు విధిగా భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. 20న తెలంగాణ విద్యా దినోత్సవంలో భాగంగా అన్ని కళాశాలలు, పాఠశాలల్లో జెండాను ఎగురవేయాలని, విద్యాలయాలను అందంగా ముస్తాబు చేయాలని, విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేయాలని, వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించాలని, మన ఊరు - మన బడి పనులు పూర్తయిన చోట పాఠశాలలను ప్రజాప్రతినిధులకే ప్రారంభోత్సవాలు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 21న తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ఆలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలను అలంకరింపజేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. 22న అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. మూడు వారాల పాటు కొనసాగే దశాబ్ది ఉత్సవాల్లో అన్ని శాఖలు పరస్పర సహకారంతో పనిచేస్తూ, కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ తరపున పూర్తి స్థాయిలో భాగస్వామ్యం ఉండేలా చూస్తామని, అవసరమైన ప్రతి చోట తగిన బందోబస్తును ఏర్పాటు చేస్తామని అన్నారు. ముఖ్యంగా తెలంగాణ రన్ విజయవం తానికి పోలీస్ సిబ్బంది అందరు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ గిరిరాజు, జెడ్పి సీఈఓ గోవింద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుక్కల దాడి.. వృద్ధులకు తీవ్ర గాయాలు

- బోధన్ అస్పత్రిలో అందుబాటులో లేని వైద్య సేవలు

నవతెలంగాణ-బోధన్



గాయపడ్డ సుభాని

బోధన్ పట్టణంలోని రాకస్ పేట్ లో గత రెండు రోజులుగా వీధి కుక్కలు స్థానికులపై దాడికి పాల్పడుతూ తీవ్ర అలజడిని సష్టిస్తున్నాయి. శుక్రవారం రాత్రి మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద వాచ్మెన్ గా పనిచేస్తున్న సుభాని ఆ ప్రాంతంలో నిలబడి ఉండగా వీధి కుక్కలు ఆకస్మాత్తుగా వచ్చి వాచ్ మెన్ సుభాని పై దాడి చేయడంతో పెదవులు తెగిపోయి, శరీరంపై గాయాలయ్యాయి. దాంతో తీవ్ర రక్త రక్తస్రావమైన సుభానిని స్థానికులు జిల్లా ఆసుపత్రిలో తరలించారు. అక్కడ సరైన వైద్యం అందించకుండా నామమాత్రంగా చికిత్స చేసి నిజామాబాద్‌కు రిఫర్ చేశారని పలువురు ఆరోపించారు. నిజామాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సుభానికి వైద్యం అందిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. పెదవితో పాటు శరీరంపై గాయాలు కావడంతో వద్దుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. అలాగే శుక్రవారం రాత్రి సమయంలో అదే ప్రాంతంలో కొంతమంది వద్ద మహిళలు వెళ్తుండగా మళ్లీ వీధి కుక్కలు ఆకస్మత్తుగా వారిపై దాడి చేశాయని స్థానికులు తెలిపారు. గాయపడిన వద్దులను జిల్లా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించినట్లు స్థానికులు తెలిపారు. బోధన్ జిల్లా ఆసుపత్రిలో కుక్క కాటుకు సరయిన వైద్యం అందించడం లేదని బాధితులను జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారని పలువురు ఆరోపించారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి వీధి కుక్కలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాజకీయానికి అడుగులు నేర్పిన ఘనుడు ఎన్టీఆర్

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

నవతెలంగాణ-నసురుల్లాబాద్/వర్ని



విగ్రహం ఆవిష్కరిస్తున్న స్పీకర్

రాజకీయాలకు విలువ తెచ్చిన మహనీయుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వర్ని మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు నెమ్లీ సాయిబాబా మందిరం కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహ ఏర్పాట సందర్భంగా నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నందమూరి తారక రామారావు సామాన్య ప్రజలకు పేదలకు బడుగు బలహీన వర్గాలకు రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత ఎన్టీ రామారావుది అని అన్నారు. తాను సైతం ఆయన అడుగు జాడల్లో నడిసిన వ్యక్తినని, మీ ముందు ఇంతగా మాట్లాడుతున్న అంటే ఎన్టీ రామారావు నేర్పిన రాజకీయ అడుగులే అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పటేల్ పట్వారి వ్యవస్థను నిర్మూలించి, దొరతనాన్ని ఉక్కు పాదంతో అణిచివేసి ప్రతినిత్యం ప్రజల అవసరాలు తెలుసుకొని అభివృద్ధి దిశలో నడిపిన ఏకైక ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అని కొనియాడారు.

డ్వాక్రా మహిళా సంఘాలకు నాంది పలికి మహిళలంటే ఆదిపరాశక్తిలని మహిళలకు ప్రతి రంగంలో 50 శాతం రిజర్వేషన్ ఉండాలని, ప్రతి రంగంలో ముందుండాలి అని మహిళలను ప్రోత్సహించిన మహా యోధుడు ఆడబిడ్డకు తన పుట్టిన ఇంట్లో తన అన్నదమ్ములతోపాటు తనకు కూడా సమానమైన ఆస్తిపస్తులు వచ్చే విధంగా జీవో అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని ఆయన అన్నారు.

గొర్రెల స్కీంపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పెంపకం దారులకు రెండవ విడత గొర్రెల పంపకం చేపట్టడంతో కురుమ, గొల్ల కులస్తులకు గొర్రెల పెంపకం దారులకు శనివారం పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో గొర్రెల పెంపకం దారులకు పశు వైద్య డాక్టర్ బండివార్ విజయ్ అభివృద్ధి పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ ఛైర్మన్ కొండగంగాధర్, మద్నూర్ సర్పంచ్ సూర్యకాంత్, ఉపసర్పంచ్ బాయిన్వర్ విట్టల్, బి ఆర్‌ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి కుశాల్ రచ్చవార్, మద్నూర్ పశువుల హాస్పిటల్ ఏడి వెంకటేశ్వర్‌రెడ్డి, మద్నూర్ మండల్ పశువైద్యాధికారి డాక్టర్ బండి విజయ్ గొర్రెల కాపర్లదారులు పాల్గొన్నారు.

గుండారంలో ఆలయ నిర్మాణం కోసం రూ.50 లక్షలు మంజూరు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే గోవర్ధన్ కొండూరు గ్రామంలోని లక్ష్మి మాత దేవాలయం కొరకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో శనివారం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసుకొని ఆలయానికి సంబంధించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, గ్రామ అభివృద్ధి కమిటీ పెద్దలు, దేవస్థానం కమిటీ, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ కనకయ్యకు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ డాక్టర్ కనకయ్య బాధ్యతలు తీసుకున్న సందర్భంగా శనివారం ఆయనను ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మర్యాదపూర్వకంగా వేరువేరుగా కలిసి శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కనకయ్యను ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు శాలువాతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ యూనివర్సిటీ సమస్యలు త్వరగా పరిష్కరించాలని, యూనివర్సిటీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ ప్రెసిడెంట్ హరి ప్రసాద్, టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ దత్త హరి, వర్సిటీ ఔట్‌సోర్సింగ్ అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి బికోజితోపాటు తదితరులున్నారు.

ముందస్తు సాగులో బాన్సువాడ ఆదర్శం

- బాన్సువాడ సన్నబియ్యానికి విదేశాల్లో డిమాండ్
- ప్రతి గ్రామంలో అభివృద్ధి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి
- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ముందస్తు వరి పంట సాగులో బాన్సువాడ నియోజకవర్గం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన ప్రతి వ్యవసాయ సమీక్షలో బాన్సువాడ నియోజకవర్గంను ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తారని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్ నెమ్లి సాయిబాబా కళ్యాణ మండపంలో బాన్సువాడ నియోజవర్గ స్థాయి ముందస్తు వరి పంట సాగుపై రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ముందుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు ముందస్తు వరి సాగుపై అవగాహన పెంచుకోవాలని, వానకాలం వరి పంటలు మే చివరివారం జూన్ చివరి వారం వరకు వరి నాట్లు వేసుకుంటే అక్టోబర్ రెండో వారంలో వరి కోతలు వచ్చేలా చూసుకోవాలన్నారు. యాసంగి పంటలు నవంబర్‌లో నారుమల్లు వేసి డిసెంబర్ చివరి వారంలో వరి నాట్లు వేసుకుంటే మార్చి చివరి కల్లా వరి కోతలు వచ్చేలా చూసుకోవాలన్నారు. నూతన వంగడాలతో ముందస్తు వరి సాగు వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. నూతన వంగడాల వలన అధిక వర్షాలు, చీడ పీడలు లేకుండా పంట దిగుబడి పెంచుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలోని బాన్సువాడ నియోజకవర్గంలో వానాకాలం పండే సన్న రకం బియ్యానికి విదేశాలలో కూడా డిమాండ్ ఉన్నదని, అందుకు నల్గొండ, ఆంధ్ర, తమిళనాడు ఇతర ప్రాంతాల నుండి వ్యాపారులు వచ్చి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న వడ్లను కొనుగోలు చేస్తారని తెలిపారు. నియోజవర్గంలో రైతులకు విత్తనాలు, ఎరువులకు కొరత లేదన్నారు. వచ్చే 50 ఏళ్ళ వరకు బాన్సువాడ నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేవని, అలాగే దామరంచ వద్ద రూ.70 కోట్లతో 220 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్ ఏర్పాటు పూర్తయ్యిందన్నారు. రాష్ట్రంలో 2014 లో 1.08 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంటే నేడు 2.18 కోట్ల ఎకరాలకు పెరిగిందన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రంలో మొత్తం వరి ధాన్యం ఉత్పత్తి 36 లక్షల మెట్రిక్ టన్నులు కాగా.. అదే 2021-22లో 1.30 కోట్ల టన్నులకు పెరిగిందన్నారు. దేశ వరి పంట ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రంలోనే 60 శాతం వరి పంట ఉత్పత్తి సాగుతుందన్నారు. ముందస్తు వరి పంట సాగులో గత కొన్ని ఏండ్లుగా బాన్సువాడ నియోజవర్గంలోని ఉమ్మడి వర్ని, కోటగిరి, బీర్కూర్ మండలాల్లో ముందస్తు వరి పంటల సాగు కాగా బాన్సువాడ మండలంలో, బుడ్మి, కొత్తబాది, తిర్మాలపూర్, తడ్కోల్, తదితర గ్రామాల రైతులు వెనుకంజులో ఉన్నారని ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవాలంటే రైతులు 15 రోజులు ముందు వరి నాట్లు వేసుకోవాలని సూచించారు. అనంతరం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, కామారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రమోహన్‌లను డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఘనంగా సన్మానించారు.

వ్యవసాయ శాఖపై అసహనం..

నస్రుల్లాబాద్ మండల వ్యవసాయ అధికారులు తప్పుడు నివేదికలు ఇవ్వడంతో అధికారులపై సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, రైతులను కలిసి నివేదికలు



సమావేశానికి హాజరైన రైతులు

రూపొందించాలని, గాలి లెక్కలు రాయవద్దని హెచ్చరించారు. రైతు వేదికలు ఇప్పటికీ ఏఈఓలు వెళ్లడం లేదని, రైతు వేదికల తాళాలు తీసి రైతులకు అవగాహన కల్పించే వారే కరువయ్యారని, వీరిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు.

ప్రతి గ్రామంలో ప్రగతి నివేదిక ఫ్లెక్సీలను ఏర్పాటు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి ఇప్పటివరకు గ్రామాల్లో మంజూరైన నిధుల వివరాలు, పూర్తయిన అభివృద్ధి పనుల వివరాలను ఫ్లెక్సీ రూపంలో గ్రామాలు మూడు నాలుగు ఏర్పాటు చేయాలన్నారు. చేసిన అభివృద్ధికి సంబంధించిన ఫోటోలను ఫ్లెక్సీల్లో పెట్టాలని సూచించారు. ప్రతి సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నివేదికలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంత్, కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్, బోధన్ బాన్సువాడ ఆర్డీవోలు రాజాగౌడ్ రాజేశ్వర్, రుద్రూర్ కృషి విజ్ఞాన్ కేంద్రం, ఏరువాక కేంద్రం, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రి యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతుబంధు సమితి అధ్యక్షులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాల పోరాటాన్ని ఉధృతం చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్ పిలుపు



పోరాటం వద్దే భోజనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండ్ల స్థలాల పోరాటాన్ని ఉధృతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్ పిలుపునిచ్చారు. నిజామాబాద్ నగరంలో నిర్వహిస్తున్న ఇండ్ల స్థలాల పోరాటం మూడవరోజు శనివారం విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ఏండ్ల తరబడి ప్రభుత్వానికి ఎన్ని అర్జీలు పెట్టుకున్నా స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. విసిగి వేసారి ప్రజలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని పోరాటాన్ని కొనసాగిస్తున్నారని వారి న్యాయమైన పోరాటానికి ప్రభుత్వం స్పందించి వెంటనే ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాల పోరాట కేంద్రానికి వచ్చి కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కొండ గంగాధర్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యురాలు బెజగం సుజాత, నగర కమిటీ సభ్యులు ద్యారంగుల కృష్ణ, షేక్ అబ్దుల్, నాయకులు కళావతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మనసికోల్లాసం

- క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ వీ గంగాధర్ గౌడ్



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

క్రీడలతోనే మనసికోల్లాసం కలుగుతుందని మాజీ ఎమ్మెల్సీ వీ గంగాధర్ గౌడ్ తెలిపారు. శనివారం మండలంలోని రాంపూర్.డి, తిర్మన్‌పల్లి గ్రామాల మధ్యలోని విశ్వ అగ్రోటెక్ ముందు గల మైదానంలో నిర్వహిస్తున్న ఓపెన్ టూ ఆల్ క్రాక్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఇందల్‌వాయి మండలంలోని వెంగళ్‌పాడ్, బీసీసీ మధ్య జరగనున్న మొదటి మ్యాచ్‌ను టాస్ వేసి బ్యాటింగ్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటగా క్రీడాకారులను పరిచయం చేసుకుని అనంతరం మాట్లాడారు. ప్రతి క్రీడలో గెలుపోటములు సహజమని చెప్పారు. ఓడినా నిరుత్సాహ పడకుండా.. గెలిచినా ఉప్పొంగకుండా మంచి ప్రదర్శన చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా చూడాలని అన్నారు. యువకులు ఇతర మార్గాల్లో వెళ్ళొద్దని సదుద్దేశంతో యువకులు మంచి నిర్ణయం చేసి ఒక టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపాయి తిరుపతి, ఇందల్వాయి మండల అధ్యక్షులు రఘునాథన్ రాము, నాయకులు రవి, కుమ్మరి గంగాధర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాజ్‌కుమార్, లచ్చుమొల్లారాజు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇండ్లలో పురోగతి లేదు

- మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి
- న్యాల్‌కల్ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పరిశీలన

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో నిర్మిస్తున్న 'డబుల్ బెడ్‌రూం' ఇండ్లలో పురోగతి లేదని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి అన్నారు. ఆ గ్రామంలో పేదల కోసం నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నాయకులు ముప్పగంగారెడ్డి, నగేష్‌రెడ్డి బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. న్యాల్‌కల్ గ్రామంలో 200ల మంది వడ్డెర కుటుంబాలకు ఇండ్లు లేవన్నారు. మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కలిసి స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ 2015లో ఇండ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారని, దాదాపు 9సంవత్సరాలు గడిచినా కేవలం స్లాబుల వరకే పరిమితమయ్యాయని తెలిపారు. అవి కూడా నాణ్యత లేకుండా నిర్మించారని ఆరోపించారు. నాసిరకమైన ఇసుక, సిమెంట్ వాడటం వల్ల నిర్మించింది ఎప్పుడు కూలిపోతుందో



ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న నాయకులు

తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. దాదాపు మూడు నెలల క్రితమే స్థానిక ఎమ్మెల్యే ఆ ఇండ్లను పరిశీలించారని, కానీ ఏ మాత్రం పనుల్లో పురోగతి లేదని అన్నారు. ఇప్పటికైనా వాటిని నిర్మించి నిరుపేదలకు ఇవ్వాలని చేతకాకపోతే ఇప్పుడే రాజీనామా చేయాలని అన్నారు. సీఎం కేసీఆర్ పేదలను విస్మరించి రింగ్‌రోడ్డులకు, ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్‌లు మాటలకే తప్పా చేతలకు సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వ పాలన ఉందని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లతో పోలిస్తే నామమాత్రంగా కూడా డబుల్ బెడ్ రూమ్ లేవని అన్నారు. నాయకులు నగేష్‌రెడ్డి మాట్లాడుతూ.. 1993లో కాంగ్రెస్ హయాంలో దాదాపు 12 ఎకరాలు భూమిని మండలంలో నిరుపేదలకు పంపిణీ చేశారని తెలిపారు. రూరల్ ఎమ్మెల్యేకు ఏమాత్రం తన నియోజకవర్గం మీద చిత్తశుద్ధి లేదని అన్నారు. పేదల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగులు కూడా చాలామంది ఉన్నారని ఉద్యమకారులను గాలికి వదిలేశారని తెలిపారు. కార్యక్రమంలో మోపాల్ మండలాధ్యక్షుడు బున్ని రవి, మాజీ ఎంపీపీ కిరణ్‌రావు, అంజాగౌడ్, ఉపాధ్యక్షుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

- టీయూలో కొనసాగుతున్న నిరసన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్న వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ యూనివర్సిటీలోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ముందు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వి.దత్తహరి మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ అధ్యాపకులందరూ సమిష్టిగా ఒకే ఒక డిమాండ్ ఉందని, తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో దాదాపు 53 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్నామని, ఇది కాకుండా సౌత్ క్యాంపస్ భిక్కనూర్, సారంగాపూర్ క్యాంపస్‌లోనూ నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇక్కడ పనిచేస్తున్న అధ్యాపకులు ఉన్నత చదువులు చదివి నెట్, సెట్ వంటి ఇతర క్వాలిఫికేషన్ కలిగి ఉండి ఎంఫిల్, పీహెచ్‌డీ, బోధన అనుభవం కలిగి ఉన్నామన్నారు. ఈ ఉద్యోగానికి కావలసిన అర్హతల కన్నా ఎక్కువ అర్హతలు కలిగి ఉండి తాము ఇక్కడ పనిచేస్తున్నామని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కేసీఆర్ రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థ ఉండకుండా చేస్తానని హామీ ఇచ్చారని, కానీ ఏండ్లు గడుస్తున్నా ఇచ్చిన మాట అమలు కాలేదన్నారు. యూనివర్సిటీలో గత 13 ఏండ్ల నుంచి విద్యాబోధన చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ చెప్పినట్టుగా కాంట్రాక్టు వ్యవస్థలో పనిచేస్తున్న అందరినీ రెగ్యులరైజ్ చేస్తున్నారని, యూనివర్సిటీలలో పనిచేస్తున్న తమను కూడా అదేవిధంగా రెగ్యులరైజ్ చేయాలని కోరుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా 2015లో తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కూడా చేశారని, దీని ద్వారా తమలో కొత్త ఉత్సాహం వచ్చినట్టు కనిపించిందని, కానీ ఇప్పుడు కొన్ని శాఖలలో వారిని రెగ్యులరైజ్ చేయడం మమ్మలను మర్చిపోవడంతో బాధను కలిగిస్తుందని వాపోయారు. ఇప్పటికైనా అధ్యాపకులపై నమ్మకంతో పనిచేస్తున్నామని, ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

క్రీడాకారులకు సన్మానం

నవతెలంగాణ-భీంగల్

ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం కప్ క్రీడ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మండల క్రీడాకారులను జెడ్పీటీసీ చౌటపల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్ శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. జిల్లాస్థాయిలో కబడ్డీ, రన్నింగ్ పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే అథ్లెటిక్‌లో శ్రీవర్ధిని, ఖోఖోలో అజయ్, ఉమేష్ చంద్రలు, కబడ్డీలో ఉదయ్, దిలీప్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీఓ గంగమోహన్, ఏపీఓ నర్సయ్య, ఎంపీటీసీలు సాయిప్రసన్న, బాలకృష్ణ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ మందిరంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడినట్టు గౌడ సంఘం సభ్యులు శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. శుక్రవారం సాయంత్రం సమయంలో సీసీ కెమెరాల రూట్ మార్చేసి గుడి తాలం పగుల గొట్టి అమ్మవారి మెడలోని పుస్తెల తాడుకు ఉన్న మంగళ సూత్రాలు సుమారు ఐదు మాసల బంగారం దొంగలించుకుపోయారు. గమనించిన గౌడ సంఘం సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు మృతి

నవతెలంగాణ-మోపాల్

మద్యం తాగే క్రమంలో వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ మహేష్ వివరాల ప్రకారం.. మండలంలోని తానాకుర్దు గ్రామానికి చెందిన తిరుపతి నాగయ్య (70) అనే వృద్ధుడు మోపాల్‌లోని వైన్స్ వద్ద గల పర్మిట్ రూమ్ నందు మద్యం తాగే క్రమంలో మృతిచెందాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లొంక రామలింగేశ్వర ఆలయంలో త్రితల రాజగోపురం నిర్మాణానికి కృషి చేస్తా

- తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్



బాజిరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ మండల కేంద్ర పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలో గల అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన లొంక రామలింగేశ్వర ఆలయంలో త్రితల రాజగోపుర నిర్మాణానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శనివారం హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసంలో సిరికొండ లొంక రామ లింగేశ్వర ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం లొంక మహాక్షేత్రంలోని పుష్కరిణి, క్షేత్రానికి వెళ్లే రహదారి, త్రితల రాజగోపురం పలు అంశాలపైన ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్రితల రాజగోపురం నిర్మాణానికి ఎల్లవేళలా నిధులను మంజూరు చేస్తానని, ఆలయ కమిటీ సభ్యులకు హామీనిచ్చారు. ఆలయ అభివృద్ధి పనుల్లో ఆలయ కమిటీ సభ్యులు చురుగ్గా పాల్గొని, క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అవదుత గంగాధర్, కోళ భూపతి రాజ్, బాల్‌రాజ్, బోయిడి ప్రకాష్, బాదాల సంతోష్, కనగందుల నవీన్, గ్యామ సురేష్, దాసరి మారుతి, కనగందుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఈటలను మర్యాదపూర్వకంగా కలిసిన రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త పైడి రాకెష్‌రెడ్డి గత రెండు రోజులుగా బీజేపీ రాష్ట్ర నాయకులను వరుసగా కలిశారు. శనివారం సైతం హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. వీరితో పాటు పైడి సుచరితరెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీలలో పిల్లలను చేర్పించుటకై ప్రత్యేక శ్రద్ధ

నవతెలంగాణ-ఆర్మూర్

వచ్చే జూన్ నుంచి పిల్లలను అంగన్వాడీలో చేర్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మండలంలోని పిప్రి అంగన్వాడీ సూపర్‌వైజర్ వెంకట రమణమ్మ శనివారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులకు అందించే పోషక పదార్థాలను అంగన్వాడీల ద్వారా అందిస్తున్నట్టు వివరించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎడపల్లి ప్రజాప్రతినిధులు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎడపల్లి మండల ప్రజాప్రతినిధులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం ఎంపీపీ కే శ్రీనివాస్ ఎడపల్లి మండలంలో చేసిన, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామాల వారీగా ఎంతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే సహాయసహకారాలతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు వివరించారు. బోధన్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ఎమ్మెల్యే షకీల్‌కు ప్రజాప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇమాన్‌ఖాన్, కుర్నాపల్లి ఎంపీటీసీ, ఎంపీటీసీల ఫోరం ఎడపల్లి మండలాధ్యక్షులు వెంకయ్యగారి రామిరెడ్డి, మంగళ్‌పాడ్ ఎంపీటీసీ అరుగుల వనజ నాగరాజు, బీఆర్ఎస్ ఎడపల్లి మండల ప్రధాన కార్యదర్శి మంద సంజీవ్ కుమార్ ఉన్నారు.

సివిల్స్ టాపర్‌కు నవోదయ పూర్వ విద్యార్థుల సన్మానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌కు చెందిన కంఠం మహేష్ సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 200 ర్యాంకు సాధించడంతో నవోదయ విద్యాలయం పూర్వ విద్యార్థులు ఆయనను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నవోదయ పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షులు వెంకటరమణ గౌడ్, ఎర్రోల వినయ్ శంకర్, కార్యదర్శి అనిల్, రేణుకా, వెంకటేష్, రూప్ కుమార్, సంతోష్, శ్రీకాంత్, వినోద్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బీబీపాటిల్‌కు సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మూడు రాష్ట్రాల సరిహద్దులో గల మద్నూరు మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయాన్ని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సందర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయాన్ని సందర్శించిన ఎంపీ బీబీ పాటిల్‌కు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ అధికారి వేణు ప్రత్యేకంగా సన్మానించారు. ఎంపీ వెంట పలువురు నాయకులు ఉన్నారు.


ఎంపీని సన్మానిస్తున్న ఆలయ కమిటీ

పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి

భిక్కనూర్ ఎస్ఐ ఆనంద్‌గౌడ్

నవతెలంగాణ-భిక్కనూర్

తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని భిక్కనూర్ ఎస్ఐ ఆనంద్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. వేసవికాలంలో ఈత కొట్టడానికి చెరువులు కుంటల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలని, చిన్నారులకు బైక్‌లు ఇవ్వొద్దని తెలిపారు. సెలవు వేళ.. ఎక్కువగా ఫోన్లు, టీవీలకు పిల్లలు అలవాటు కాకుండా ఇన్‌డోర్, ఔట్ డోర్ ఆటలు ఆడించాలని సూచించారు. రాత్రి సమయంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ఎమ్మార్పీ ధరలకే విక్రయాలు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెట్‌ను ఏర్పాటు చేసిందని, దీని ఈ నెల 29న సోమవారం ప్రారంభించుకోనున్నట్టు సంఘం చైర్మన్ చాట్ల గోపాల్ తెలిపారు. శనివారం నాడు రైతు ఉత్పత్తిదారుల కార్యాలయంలో సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ రైతులకు ఎరువులు విత్తనాలు ఎంఆర్పి ధరలకే లభిస్తాయని తెలిపారు. రైతులు రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో ఎరువులు విత్తనాలు కొనుగోలు చేసుకోవచ్చని రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రారంభోత్సవానికి సంఘం పరిధిలోని రైతులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతం చేయాలని చైర్మన్ రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాల వెల్లువ


విరాళాలు అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని పోతిరెడ్డిపల్లి వీరాంజనేయ స్వామి దేవస్థానము భూదానము నిమిత్తం భక్తుల విరాళాల వెల్లువా కొనసాగుతున్నట్టు ఆలయ నిర్వహకులు తేజ స్వామి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో భాగంగా భూదానము నిమిత్తం మాటూరి సాయిరెడ్డి, అంజిరెడ్డి గుండె నెమలి వారు 5116 రూపాయలను విరాళముగా అందజేయగా, రాంపూర్ (కలన్)కు చెందిన ఎంపీటీసీ సునీత బలరాం రెడ్డి 12 వేల రూపాయలను అందించారు. హైదరాబాద్ పట్టణమునకు చెందిన మంద్రాదిరెడ్డి 5116 రూపాయలను విరాళముగా అందజేశారు. ఆలయ ఇతరాత్ర పనుల కట్టడాల నిమిత్తం బాన్సువాడకు చెందిన పోతుల వెంకట్‌రెడ్డి జడ్పిటిసి ఒక లారీ ఇసుక లోడును అందించారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సురేష్ స్వామి , భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి(తాద్వాయి)

తెలంగాణ రాష్ట్రం సాధించిన అనంతరం ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత గత తొమ్మిది సంవత్సరాలుగా సాధించిన ప్రగతిని పల్లె పల్లెన ప్రజలకు వివరిస్తూ ఘనంగా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి హాజరై మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాలలో నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని, అందరూ ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రభుత్వం సూచించిన క్యాలెండర్ ప్రకారం పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు.

జూన్ 2 న పథకావిష్కరణ, దశాబ్ది ఉత్సవ సందేశంతో ఉత్సవాలు ప్రారంభమై జూన్ 22 అమరవీరుల సంస్మరణ సభ, అమరవీరుల స్తూపం అవిష్కరణతో ముగిస్తున్నట్లు తెలిపారు.

20 రోజుల పాటు ఊరూరా పండుగ వాతావరణంలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని, తెలంగాణ ప్రగతిని ప్రతి ఒక్కరికి తెలిసేలా వెలుగెత్తి చాటాలన్నారు. రాష్ట్రం రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని మరొక్కసారి గుర్తు చేస్తూ ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రైతు వేదికల వద్ద ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రైతులతో కలిసి భోజనం చేయాలని అన్నారు. రాష్ట్రం ఏర్పాటు లాగే కామారెడ్డి జిల్లా ఏర్పాటు అనేది ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని, అదే విధంగా నూతన మండలాలు, నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుతో ప్రజలకు పాలన మరింత దగ్గరైందని అన్నారు. కొత్త జిల్లాగా ఏర్పాటు అయిన కామారెడ్డి జిల్లా కేంద్రంలో సంబరాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు.



మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా విద్య కోసం జరుగుతున్న కృషిని, మన ఊరు- మన బడి కింద పాఠశాలల్లో వచ్చిన మార్పును నాడు-నేడు ఫొటోలతో ప్రదర్శించాలని పేర్కొన్నారు. కామారెడ్డికి మెడికల్ కాలేజ్, బాన్సువాడలో నర్సింగ్ కళాశాల, వివిధ చోట్ల వచ్చిన ప్రభుత్వ డిగ్రీ, ఇతర కళాశాలలు, గురుకుల, సంక్షేమ ఇతర పాఠశాలల వివరాలు తెలియజేయాలన్నారు. పల్లెప్రగతి, పట్టణ ప్రగతితో జాతీయ స్థాయి అవార్డులు సాధించి తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

మిషన్ కాకతీయ పథకం ద్వారా సాగునీటి చెరువుల పునరుద్ధరణ, గ్రామాల్లో చెక్ డ్యాములు, ఊట చెరువుల నిర్మాణం తో భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. రాష్ట్రం వస్తే చీకటి అవుతుందని చెప్పిన చోట నేడు విద్యుత్తు వెలుగులు చిమ్ముతూ 9 ఏళ్లలో సాధించిన ప్రగతిని గర్వాంగా చాటుకుంటు ప్రజలతో మమేకం అవుతూ ప్రచారం చేయాలన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని, ఒక్కో గ్రామానికి అందుతున్న రైతు బంధు, రైతు భీమా, వివిధ రకాల పెన్షన్లు, షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి, చెరువుల్లో వదిలిన చేప పిల్లలు, గొర్రెల పంపిణీ అన్ని రకాల వివరాలతో గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కింద మంజూరైన పనుల వివరాలతో పాటు అన్ని రకాల అభివృద్ధి నిధుల వివరాలు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. ఆధునికతతో ఉపాధి కోల్పోయిన కుల వృత్తుల వారికి అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించి ఒక లక్ష రూపాయలు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు నిర్ణయించారని తెలియజేశారు. ఈ మేరకు పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేసి దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అందజేయాలని సూచించారు. 4,480 మంది రైతులకు 12,969 ఎకరాలు పోడు పట్టాలు గిరిజనులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత గల వారికి ఇంటి స్థలాల పట్టాలు అందజేయాలని తెలిపారు. జూన్ 19న జరిగే తెలంగాణ హరితోత్సవం కార్యక్రమంలో గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని చెప్పారు.

ఈ సమావేశంలో జెడ్పి చైర్ పర్సన్ శోభ, ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు సురేందర్, హనుమంత్ షిండే, మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దిన్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే , డిఎఫ్ఓ నిఖిత, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మంత్రి హరీష్‌రావు పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి
- లింగంపేట్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-లింగంపేట్

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు నేడు (ఆదివారం) ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ముందుగా నాగిరెడ్డిపేట్ మండలంలోని లింగంపల్లి గ్రామం వద్ద పోచారం ప్రధాన కాలపై 50 లక్షల 90 వేల రూపాయల వ్యయంతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఎల్లారెడ్డి పట్టణంలో 14 కోట్లతో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని గండి మాసన్నపేటలో బస్తి దవాఖానా ప్రారంభించ నున్నారు. అనంతరం లింగంపేట్‌లో బీఆర్ఎస్ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొననున్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పర్యటన విజయవంతం చేయాలి: జెడ్పిటిసి

మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని లింగంపేట్ జడ్పీటీసీ సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి కోరారు. శనివారం లింగంపేట్ మండల కేంద్రంలోని ఆదివారం జరగనున్న బి ఆర్ ఎస్ మండల స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటల 15 నిమిషాలకు లింగంపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో మండల స్థాయి బి ఆర్ ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నామని, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామ కమిటీ అధ్యక్షులు రైతు సమన్వయ కమిటీ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సమావేశాన్ని విజయోత్సవం చేయాలని ఆమె కోరారు. జడ్పీటీసీ వెంట ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్ధారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రమేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ నాయక్, మాజీ ఎంపీపీ మూదం సాయిలు, శ్రీకాంత్, నరేష్, సాయిరాం, యూసుఫ్, తదితరులు ఉన్నారు.

ఎస్ఐకి సన్మానం


ఎస్ఐని సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

నవతెలంగాణ-దోమకొండ

రాష్ట్రస్థాయిలో పోలీస్ శాఖ వీధి నిర్వహణలో ఉత్తమ సేవ పథకం అవార్డును హోమ్ మంత్రి మహమ్మద్ ఆలి, డిజిపి అంజని కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న దోమకొండ ఎస్ఐ సుధాకర్‌ను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు శనివారం సన్మానించారు. ప్రజలకు మరింత సేవలు అందించాలని ప్రతి గ్రామంలో ఫ్రెండ్లీ పోలీస్ పకడ్బందీగా అమలు చెయ్యాలని కోరారు. భవిష్యత్తులో పోలీస్ శాఖలో మరిన్ని ఉన్నతమైన పదవులు స్థానాలు అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దోమకొండ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు గరిగే సురేష్, బీసు సంతోష్ కుమార్, గోత్రల విక్రమ్ దేవోల్ల రాములు, అబ్రబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అత్యధిక నిధులు

- జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక నిధులు విడుదల చేస్తుందని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. దోమకొండ మండలంలోని సీతారాం పల్లి గ్రామంలో ఇరవై లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణంతో పాటునాలుగు లక్షలతో కుర్మ సంఘం భవనం నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి కోసం సీఎం కెసిఆర్ అత్యధికంగా నిధులు కేటాయించుతున్నారని, కామారెడ్డి నియోజకవర్గం లో ప్రతి గ్రామం లో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణలు చేపట్టు తున్నామని తెలిపారు. దోమకొండ మండలంలోని సీతారాంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న టువంటి గ్రామ పంచాయతీకి 20 లక్షల రూపాయలతో నిర్మిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా కుర్మా సంఘ భవనానికి నాలుగు లక్షల రూపాయలతో చేపట్టబోయే భవన నిర్మాణం పనులకు భూమి పూజ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ సిడిసి చైర్మన్ ఐరేని నరసయ్య, ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు , జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గంద్ర మధుసూదన్ రావు, సీతారాం పల్లి గ్రామ సర్పంచ్ జలిగామ నాంపల్లి, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తున్న విప్ గంపగోవర్ధన్


గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన హాజీ ప్రకాష్ (28) శనివారం ఉదయం బిచ్కుంద నుండి మద్నూర్ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కందర్ పల్లి గ్రామ సమీపాన జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలైన హాజీ ప్రకాష్ ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ప్రకాష్ భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మృతిచెందిన యువకుడు

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేత

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో లబ్దిదారులకు సర్పంచ్ ఎమ్మార్వోల చేతుల మీదుగా 18 లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తరవాత ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసి అదుకుంటున్నారని అన్నారు. ఇందులో భాగంగానే పేద కుటుంబంలో పుట్టిన అడబిడ్డల పెండ్లి కుటుంబీకులకు ఆర్థిక భారం కావొద్దనే ఉద్దేశ్యంతో కల్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకం ద్వారా లక్షా ఒక వంద పదహారు రూపాయలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ఘనత ఒక్క కేసీఆర్ కే దక్కిందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుమల్‌రెడ్డి, తహసీల్దార్ దశరథ్, ఆయా గ్రామాల సర్పంచులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

సిద్దిపేట్‌కే కాదు.. ఎల్లారెడ్డికీ నిధులివ్వాలి


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

సిద్దిపేట్‌కే కాకుండా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సైతం నిధులు కేటాయించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎల్లారెడ్డిలో వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటన నేపథ్యంలో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. 'మీ మామ, మీ బావమరిది నియోజక వర్గాలే తెలంగాణ అనుకుంటున్నారా..? నిధులు, ఆస్తులు మీకు సమావేశాలు, సభలు సంబురాలు మాకా?' అని ప్రశ్నించారు. పర్యటన నేపథ్యంలో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపి నాయకులు దేవేందర్, ప్రశాంత్‌గౌడ్, రాజేష్, మంగలి సతీష్, మర్రి బాలకిషన్, విద్యా సాగర్, నరేష్ , శంకర్ , సుజాత తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాకు భూమిపూజ

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో పల్లె దావకాన ఏర్పాటుకు శనివారం వైస్ ఎంపీపీ రవీంద్రరావు, స్థానిక సర్పంచ్ దండబోయిన సంజీవ్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంజీవ్ మాట్లాడుతూ.. పల్లె దావకానాలతో, గ్రామాల్లో పేదలందరికీ వైద్యం అందాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె దావకానాలను ఏర్పాటు చేస్తుందని, రామారెడ్డి లో రెండు పల్లె దావకానాలను రూ, 40 లక్షలతో పనులను ప్రారంభించామని తెలిపారు. దావకానాను మంజూరు చేసినందుకు గ్రామస్తుల తరఫున స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి, మండల రైతు బంధు అధ్యక్షులు నారాయణరెడ్డి, జిల్లా రైతుబంధు డైరెక్టర్ కాసర్ల రాజేందర్, వైద్యులు సురేష్,బి ఆర్ ఎస్ నాయకులు రంగు రవీందర్ గౌడ్, గడ్డం చిన్న రవీందర్ రెడ్డి, నరసారెడ్డి, పడిగల శ్రీనివాస్, శెట్టి రాజు, సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

చేపల పెంపకంతో లాభాలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం మండల సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రాజిరెడ్డి మాట్లాడుతూ చేపల పెంపకం వలన మంచి లాభాలు ఉన్నాయని తెలిపారు. స్త్రీ నిధి రుణాలపై వివరించారు. ఆడిట్ జనరల్ బాడి సమావేశాల గురించి తె లిపారు. గతనెలలో నిర్వహించిన సమీక్ష సమావేశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సిసిలు అబ్బులింగం, ఆంజనేయులు, గొర్రె రాములు, నరేందర్ రెడ్డి, కృష్ణాంజలి, సౌజన్య వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో17 వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు నాలుగు వార్డులలో పారిశుధ్యం పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా శనివారం 17వ వార్డులో పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్, కౌన్సిలర్ ఫాయాజ్, మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బీజేపీ మండల కార్యాలయంలో మండలాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన మండల కార్యవర్గ సభ్యుల సమావేశాన్ని మండల కేంద్రంలో నిర్వహించినట్టు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రుయ్యాడి రాజేశ్వర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు, దిశా కమిటీ సభ్యులు కిషన్ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొప్పు రాజేందర్, సీనియర్ నాయకులు జగడం పోషన్న, ఆదిరెడ్డి, ఆర్.నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి కుంట శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు దత్తాత్రేగౌడ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి విక్రమ్, బీసీ సెల్ మండల అధ్యక్షులు భూమన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

గొప్పమనిషి 'జవహర్ లాల్ నెహ్రూ'

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆధునిక దేవాలయాలు నిర్మించిన గొప్ప మనిషి జవహర్‌లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. శనివారం భారతదేశ మొదటి ప్రధాని భారతరత్న జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ భవన్‌లో ఆయన చిత్రపటానికి, అలాగే నెహ్రూ పార్క్ వద్ద నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. నెహ్రూకి బాలలంటే చాలా ఇష్టమని, అందుకే నెహ్రూ పుట్టినరోజున బాలల దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. దేశంలో వంద సంవత్సరాలైనా మర్చిపోనటువంటి అభివృద్ధి, సంస్కరణలను చేసిన మహోన్నత వ్యక్తి నెహ్రూ అని కొనియాడారు. దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు తినడానికి కూడా తిండి లేని పరిస్థి తిలో ప్రధానమంత్రి అయిన నెహ్రూ ఆయనకున్న తెలివితో ఎంతోమంది స్వాతంత్ర సమరయోధుల ఆలోచనలతో దేశాన్ని వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ముందుకు నడిపిస్తూ ప్రపంచ స్థాయిలో నిలిపారని చెప్పారు. బీజేపీలోని కొందరు వ్యక్తులు దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించిన నెహ్రూని చిన్న చూపు చూస్తూ దేశం కోసం ఏమీ చేయనటువంటి వ్యక్తులను గొప్పగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా దేశ మొదటి పౌరురాలు ద్రౌపది ముర్మును బీజేపీ అవమానించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణురాజ్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు రాజ నరేంద్రగౌడ్, పీసీసీ మాజీ కార్యదర్శి రాంభూపాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పోల ఉషా, తంబాకు చంద్రకళ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్, పీసీసీ డెలికెట్ ఈసా, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షులు ప్రీతం, కాంగ్రెస్ మహిళా నగర అధ్యక్షురాలు రేవతి తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎస్సీ స్టడీ సర్కిల్ అర్హత పరీక్షా ఫలితాలు విడుదల

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్‌లో గల ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 5 నెలల పాటు గ్రూప్స్, బ్యాంకింగ్, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు ఇవ్వబడే ఉచిత నివాసిత కోచింగ్‌కు గాను నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు ఎస్సీ సంక్షేమశాఖ అధికారిణి శశికళ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష రాసినవారు www.tsstudycicle.co.in వెబ్‌సైట్ ద్వారా చూసుకుని, ఎంపికైన వారు ఈనెల 29,30,31వ తేదీల్లో వారు పొందిన సమాచారం ప్రకారం అన్ని సర్టిఫికెట్లను ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సమర్పించి అడ్మిషన్లు పొందాలని డైరెక్టర్ విజయకుమార్ సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డం ధర్మేందర్‌కు శనివారం రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కొద్ది రోజుల క్రితం ధర్మేందర్ కుమారుడు గడ్డం రేవంత్ అమీర్‌నగర్ గ్రామ శివారులో వ్యవసాయ తోటలో ఉన్న బావిలో ఈతకు వెళ్లి దురదృష్టవశాత్తు మృతి చెందాడు. ఇటీవల వారి ఇంటికి వెళ్లి బాల్కొండ బీజేపీ నాయకులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ పరిస్థితిని ఆయన స్థానిక బీజేపీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబం పరిస్థితిని గమనించిన మల్లికార్జున్‌రెడ్డి సూచనల మేరకు బీజేపీ మండల నాయకులు మృతుని తండ్రి ధర్మేందర్‌కు భారతీయ జనతా పార్టీ కమ్మర్‌పల్లి మండల శాఖ తరఫున రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కట్ట సంజీవ్, నాయకులు కుంట భూమరెడ్డి, ఎలాల వెంకట్‌రెడ్డి, చిట్యాల దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని లింగాపూర్ గ్రామంలో సర్పంచ్ బత్తూరు సాయిలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మహమ్మద్ మహినోద్దీన్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయిలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే షకీల్ ఆమీర్ సహకారంతో లింగాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ మోహినోద్దీన్ రూ.22వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు టేకు పోశెట్టి, బీఆర్ఎస్ నాయకులు కోరే రవి, జలంధర్, కరిపే గంగాధర్, గంగోని గంగాధర్, గొట్టుముక్కుల సాయిలు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ



క్రీడా దుస్తులు వితరణ చేస్తున్న పల్లపు రమేష్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పల్లపు రమేష్ రూ.10వేల విలువ గల క్రీడా దుస్తులను శనివారం వితరణ చేసినట్టు పీటీ యాదగిరి తెలిపారు. క్రీడా దుస్తులను సర్పంచ్ చేతన విజయరెడ్డి, ఎంపీటీసీ జయగిరిధర్ గౌడ్, ఉప సర్పంచ్ నాయక రాజు, ఎస్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, వీడీసీ సభ్యులు, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రెటరీ మల్లేష్ గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో భూపతి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని సారంగాపూర్ బీఈడీ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మధ్యనే ప్రభుత్వం జూనియర్ లెక్చరర్స్‌ను, డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్‌ను రెగ్యులర్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అలాగే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో మా వంతు పాత్ర పోషించామని, తమను కూడా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. కొన్ని రాష్ట్రాలలో యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను కూడా రెగ్యులర్ చేశారని అలాగే తెలంగాణ రాష్ట్రంలోనూ కాంట్రాక్ట్ అధ్యాపకులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.కరుణాకర్, వి.శ్రీనివాస్, పి.శ్రీకాంత్, డాక్టర్ ఎస్.రవీందర్, హరిత, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే



సీఐని సన్మానిస్తున్న మెడికవర్ సిబ్బంది

నవతెలంగాణ-కంఠేశ్వర్

వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా నగరంలోని మున్సిపల్ చౌరస్తాలో మెడికవర్ హాస్పిటల్ వైద్యులచే ప్రజలకు అత్యవసర సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవడంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, మెడికవర్ హాస్పిటల్ ఎమర్జెన్సీ విభాగం అధిపతి డాక్టర్ ఫణి కృష్ణ పాల్గొన్నారు. అనంతరం చందర్ రాథోడ్ మాట్లాడుతూ.. భద్రత అనేది ప్రతి వ్యక్తితో మొదలయ్యే సమిష్టి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫణి కృష్ణ మాట్లాడుతూ.. ఆకస్మిక గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, సెప్సిస్ పాలీట్రామా అనేది ఎవరికైనా మొదటి గంటలో జరిగే చికిత్స గోల్డెన్ అవర్ ఆ సమయంలో ఎంత త్వరగా పేషెంట్‌ను హాస్పిటల్‌కి తీసుకుని వేళ్తే చాలా మంది బతికే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ యజ్ఞ, డాక్టర్ వినయ్, డాక్టర్ వంశీ, మేనేజ్‌మెంట్ స్వామి, శ్రీనివాస్ శర్మ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని 29న ధర్నా

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో ఎడపల్లి ఎంపీడీవో ఆఫీస్ ముందు ఈనెల 29న ధర్నా చేయనున్నట్టు జేఏసీ నాయకులు జంగం గంగాధర్ పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది వాటర్ మెన్, ఎలక్ట్రిషన్, కారోబార్, ట్రాక్టర్ డ్రైవర్ ఇతర సిబ్బంది అందరూ తప్పకుండా ఉదయం 10 గంటలకే ఎంపీడీవో ఆఫీస్‌కు రావాలని సూచించారు.

34వ రోజుకు వీవోఏల సమ్మె



ఎడపల్లి : సమ్మెలో వీవోఏలు

నవతెలంగాణ-బోధన్/ఎడపల్లి

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 34వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీవోఏలకు ప్రభుత్వం 18000ల వేతనం మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వీవోఏలకు 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, వేతనాలను వారి ఖాతాలోనే జమ చేయాలని, జీవో నెంబర్ 58ని సవరించి అనుబంధం 5ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్త్రీనిధి నుంచి ఇన్సెంటివ్ రద్దుచేసి గౌరవ వేతనంగా రూ.5000లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ద్వారా ఐడీ కార్డులు ఇప్పించి, సెల్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హత కలిగిన వారికి సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలని, జాబ్ డిక్లరేషన్ చేయాలని, అలాగే ప్రత్యేక డ్రెస్ కోడ్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో వీవోఏలు భూమయ్య, నాగజ్యోతి, గంగామణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో..

ఎడపల్లి : మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి పథకం (ఐకేపీ) వీవోఏల సమ్మె కొనసాగింది.. క్షేత్రస్థాయిలో వీవోఏల పాత్ర ఎంతో కీలకంగా ఉందని గ్రహించిన సీఎం కేసీఆర్ వీవోఏల సమస్యలను, డిమాండ్లను పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

పెద్దమ్మ తల్లి జాతరలో పాల్గొన్న మానాల మోహన్‌రెడ్డి



జాతరలో పాల్గొన్న మోహన్‌రెడ్డి, తదితరులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామంలో శనివారం స్థానిక ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలలో కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోనగిరి భాస్కర్, జిల్లా కార్యదర్శి తక్కురి దేవేందర్, నాయకులు బద్ధం తిరుపతిరెడ్డి, చింతకుంట శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనానికి యత్నించిన వ్యక్తి అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని మూడో పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనానికి ఆటోను ప్రయత్నించిన నిందితుడు బాలాజీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన షేక్ షఫీ తన ఇంటి ముందు పార్క్ చేసిన ఆటోను శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో ఓ వ్యక్తి దొంగిలించడానికి ప్రయత్నించగా షేక్ షఫీ అతనిని పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. షఫీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఆటో దొంగతనానికి ప్రయత్నించిన కెనాల్ కట్టకు చెందిన దుల్గందే బాలాజీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పునర్వ్యవస్థీకరణ పట్ల హర్షం

నవతెలంగాణ-ఆర్మూర్

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖను పునర్వ్యవస్థీకరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 18, 19 ఉత్తర్వులను విడుదల చేయడం హర్షనీయమని డివిజనల్ ఈఈ ఆర్.శంకర్, ఏఈఈలు ఇంద్రసేనారెడ్డి, నితీష్, రామారావు శనివారం తెలిపారు. ఈ సంఖ్య ఉత్తర్వులు జారీ కావడానికి ప్రోత్సహించిన మంత్రి హరీష్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియకు అన్నివేళలా మార్గదర్శకత్వం వహించిన పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి స్మిత సబర్వాల్, ముఖ్య కార్యదర్శి శాంతకుమారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఏకలవ్య ఆదర్శ పాఠశాల గాంధారిలో 29న స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఏకలవ్య ఆదర్శ పాఠశాల గాంధారిలో 29న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఏకలవ్య ఆదర్శ పాఠశాల ఇందల్వాయిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 29న స్పాట్ అడ్మిషన్లు ఏకలవ్య ఆదర్శ పాఠశాల గాంధారిలో నిర్వహిస్తున్నామని అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏకలవ్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం ప్రారంభం నుంచి నిష్ణాతులైన అధ్యాపకులచే ఐఐటీ, నెట్ కోచింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. విద్యార్థులకు ఎల్‌సీడీ ప్రొజెక్టర్ ద్వారా విద్యా బోధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అధునాతన నూతన ప్రయోగశాల, నిష్ణాతులైన అధ్యాపకులతో బోధన, విద్యార్థులకు సులభంగా ఇంగ్లీషులో మాట్లాడడానికి స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులకు ఉదయం 5 గంటల నుంచి మానసిక ఉల్లాసానికి మంచి ఆరోగ్యాన్ని వ్యాయామాన్ని క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు పీఈటీ, పీడీల ఆధ్వర్యంలో నిర్వహణ, మారిన విద్యావిధానానికి అనుగుణంగా కాన్సెప్ట్ అండర్ పద్ధతిలో విద్యాబోధన, ప్రత్యేకమైన కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ సదుపాయం, నాణ్యమైన భోజన సౌకర్యం, హాస్టల్ వసతి, డిజిటల్ క్లాసులు, 24గంటల జీఎన్ఎం సేవలు ఉంటాయని వివరించారు. చిన్నారులను ఏకలవ్య ఆదర్శ పాఠశాల ఇందల్వాయిలో చేర్పించి వారి బంగారు భవితకు బాటలు వేయాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కోరారు.

కొనుగోలు కేంద్రాలను సందర్శించిన జిల్లా అధికారులు



సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-మెండోరా


మండలంలోని దూదిగాం, చాకిర్యాల్, సావెల్, మెండోరా గ్రామాలలో సివిల్ సప్లై కార్పొరేషన్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జగదీశ్, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ వరి కొనుగోలు కేంద్రాలను శనివారం సందర్శించారు. ధాన్యం కుప్పలను పరిశీలించి కొనుగోలు కేంద్రాల నమోదు పత్రాలు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ఆఖరి గింజవరకూ ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను గిట్టుబాటు ధరలు అమ్ముకొని రైతు లాభపడాలని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన కొద్ది రోజుల్లోనే రైతులు ఖాతాల్లో నగదు జమ అవుతుందని, రైతులెవరూ ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ గంగాధర్, సావెల్ సొసైటీ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేద్కర్ వర్ధంతి

నవతెలంగాణ-ఆర్మూర్

భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ 87వ వర్ధంతిని దళిత ఐక్య సంఘటన డివిజన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ జంగం అశోక్ మాట్లాడుతూ.. అంబేద్కర్ గొప్ప చదు వులు చదవడానికి తన సహకారం అందించిన గొప్ప మానవతా మూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బాధ్యులు కోటేశ్వర్, గుమ్మడి చంద్రయ్య, ఎల్‌టీ కుమార్ స్వామి, పింజా పెద్ద భోజన్న, గంగాధర్, సంఘం దేవారం తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన నలంద హైస్కూల్ కరస్పాండెంట్ కుమారుడు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి నలంద హైస్కూల్ కరస్పాండెంట్ అయిన లక్కారం రాజేంద్రప్రసాద్ కుమారుడు లక్కారం రాహుల్ ఇటీవల వచ్చిన ఎంసెట్లో 13,610 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా లక్కారం రాహుల్‌ను స్కూల్ యాజమాన్యం పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా లక్కారం రాహుల్ మాట్లాడుతూ తనకు ఈ ర్యాంకు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న రోడ్డు వెడల్పు పనులు

నవతెలంగాణ-ముప్కాల్

స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రోడ్లు, భవనాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రోడ్డు పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా పనులు వేనువెంటనే పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతో రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువలు, నూతన విద్యుత్ స్తంభాలు, డివైడర్ పనులు చేపడుతు న్నారు. జరుగుతున్న పనులను మండల ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మంత్రి దృష్టికి తీసుకెళ్తున్నారు.



కొనసాగుతున్న పనులు



అధిక సంఖ్యలో తరలిరావాలి

నవతెలంగాణ-ముప్కాల్

నేడు పూసల చైతన్య వేదిక ఆధ్వర్యంలో చేపడుతున్న 'పూసల సమర శంఖారావం' కరీంనగర్ సభకు జిల్లాలోని ఆయా మండలాల నుంచి పూసల సంఘం కులస్తులు, పెద్దలు, నాయకులు, ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలిరావాలని పూసల చైతన్య వేదిక జిల్లా సెక్రటరీ పస్నేర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్ర నలువైపులా నుంచి పూసల చైతన్య వేదిక సంఘం ప్రముఖులు హాజరు కానున్నారని కావున అధిక సంఖ్యలో పూసల కులస్తులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.